‘ఉపాధి’లో పండ్ల తోటలు

- ఈ ఏడాది 50 ఎకరాల్లో పెంపకమే లక్ష్యం
- సన్న, చిన్నకారు రైతులకు అవకాశం
- ఆసక్తి చూపుతున్న అన్నదాతలు



గుండ్లపల్లిలో జామతోట సాగు



ఖాసీంపేటలో బత్తాయి తోట

గన్నేరువరం: మండలంలోని రైతులు మామిడి, బత్తాయి తోటల పెంపకం గతంలో విస్తారంగా చేపట్టారు. కరువు నేపథ్యంలో 2003 నుంచి నిర్వహణ భారంగా మారింది. తోటలను కాపాడుకోవడానికి నీటి వసతి కోసం రైతులు రూ.లక్షలలు ఖర్చు చేసినా ఫలితం లేకపోవడంతో నష్టాలు చవిచూశారు. కొందరు వాటిని కాపాడలేని పరిస్థితుల్లో తొలగించారు. కానీ ప్రస్తుతం మండలంలో నీటి వసతి పుష్కలంగా ఉండటంతో మళ్లీ ఆసక్తి కనబరుస్తున్నారు. అధికారులు సైతం ప్రోత్సహిస్తున్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ఏటా అవకాశం కల్పిస్తోంది. ఈ ఏడాది 50 ఎకరాల లక్ష్యంగా ఉద్యాన, వ్యవసాయశాఖ, ఈజీఎస్ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. దీనికి అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ అందిస్తున్నాయి. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లోని రైతువేదికల ద్వారా తోటల పెంపకంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. జాబ్ కార్డుతోపాటు ఐదెకరాల భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు అవకాశం కల్పిస్తున్నారు. తొమ్మిదేళ్ల నుంచి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. కాని రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. 2022 వరకు మాదాపూర్‌లో 30 ఎకరాల్లో మామిడి, బత్తాయి, గుండ్లపల్లిలో 3 ఎకరాల్లో జామ, ఖాసీంపేటలో 15 ఎకరాల్లో మామిడి, బత్తాయి తోటలతో పాటు గన్నేరువరం, జంగపల్లి, మైలారం గ్రామాల్లో కలిపి సుమారు 60 ఎకరాల్లో రైతులు పండ్ల తోటలను సాగు చేశారని అధికారులు తెలిపారు. 2019 నుంచి మిడ్‌మానేరు ప్రాజెక్టు ద్వారా నీటి వసతి పుష్కలంగా అందుబాటులోకి రావడంతో వరి పంట సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. 2023–24లో 205 ఎకరాల్లో లక్ష్యంగా కాగా 145 రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. 70 మంది రైతులు వివిధ పండ్ల మొక్కలను నాటారు. ఈ ఏడాది మామిడి, జామ, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, ఆయిల్ ఫామ్, బత్తాయి, మునగ, తోటలకు అవకాశం కల్పించారు. అలాగే కొబ్బరి చెట్లు(పొలం గట్ల)పై పెంచుకోవచ్చాయని అధికారులు తెలిపారు. 20 మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం, ఇతరులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ సౌకర్యం కల్పించనున్నారు. గుంతలు, మొక్కల కొనుగోలు, నాటడం, ఊతకర్రలు ఏర్పాటుకు ఖర్చు మొత్తాన్ని ఉపాధిహామీ పథకం ద్వారా చెల్లిస్తారు. తోటల పెంపకానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. రైతులు దరఖాస్తులు చేసుకోవచ్చు. మండలంలో ఈ ఏడాది 50 ఎకరాల్లో పెంపకం లక్ష్యంగా పెట్టుకున్నాం. వివిధ గ్రామాల నుంచి 20 మంది రైతులు 17 ఎకరాల వరకు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ నెల 31 వరకు అవకాశం ఉందని గన్నేరువరం ఇన్‌చార్జీ ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.



నర్సరీల్లోనే మొక్కలు

- పట్టించుకోని అధికారులు
- మొక్కల కోసం తీసిన గుంతలు పూడుకుపోతున్న వైనం
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ఈజీఎస్ నర్సరీల్లోని మొక్కలు మూలుగుతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందనే విమర్శలు వెలువడుతున్నాయి. సకాలంలో నాటకపోవడం వల్ల సుమారు మీటరుకు పైగా మొక్కలు ఏపుగా పెరిగాయి. జూలై, ఆగస్టులో మొక్కలు నాటాల్సి ఉండగా నేటి వరకు అధికారులు ఆ ఊసే ఎత్తడం లేదు. ఆయా గ్రామాల్లోని నర్సరీల్లో సుమారు 45 వేల మొక్కలను పెంచారు. 42వేల మొక్కలు నాటాలని అధికారులు టార్గెట్ విధించారు. ఇప్పటి వరకు 32 వేల మొక్కలను మాత్రమే నాటారు. మరో 10 వేల మొక్కలు నాటాల్సి ఉంది. కాగా మొక్కలు నాటేందుకు గ్రామాల్లోని రోడ్ల పక్కన గుంతలు తీసి నాటించడం మరిచిపోయారు. దీంతో వర్షాలకు తీసిన గుంతలు కొన్ని పూడుకుపోయాయి. ఈవిషయంపై ఏపీవో రవిరాజాను వివరణ కోరగా గుంతలు సిద్ధంగా ఉన్నాయని, త్వరలో నాటిస్తాం అంటూ జవాబు ఇచ్చారు.

గోల్డెన్ సెకండ్లు వృథా చేయొద్దు



శిక్షణను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

- ప్రతి ఒక్కరికీ సీపీఆర్‌పై అవగాహన ఉండాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: గుండెపోటు సమయంలో అవలంబించాల్సిన సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెసిసిటేషన్) పద్ధతిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఈనెల 13 నుంచి 17 వరకు సీపీఆర్ అవగాహన వారోత్సవాల సందర్భంగా నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య సిబ్బందికి నిర్వహిస్తున్న సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గుండెపోటు సంభవించిన సమయంలో మొదటి గోల్డెన్ సెకండ్లు వృథా చేయొద్దని అన్నారు. ఈ సమయంలో సీపీఆర్ చేస్తే ప్రాణాన్ని రక్షించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఈ మధ్యకాలంలో వయసుతో నిమిత్తం లేకుండా గుండెపోటు సంభవిస్తుందని, అందువల్ల ప్రతీ ఇంట్లోనూ కుటుంబ సభ్యులకు కూడా సీపీఆర్‌పై అవగాహన ఎంతో అవసరమని అన్నారు. ఈ సందర్భంగా సీపీఆర్ సమయంలో చేయవల్సిన, చేయకూడని పనుల గురించి వైద్యులు డెమో ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల అడిషనల్ డీఎంఈ తఖియొద్దీన్ ఖాన్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఆర్ఎంవో నవీన, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, డాక్టర్ నరేశ్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న చందునాయిక్

శారీరక శ్రమతో రోగాలు దూరం

హుజూరాబాద్: శారీరక శ్రమతో రోగాలు దూరమవుతాయని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు నాయక్ అన్నారు. కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు పట్టణంలోని కాకతీయ జూనియర్ కళాశాల, మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల, చెల్పూర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... సీపీఆర్‌తో అత్యవసర సమయంలో ప్రాణాన్ని కాపాడవచ్చని, విద్యార్థులు సమతుల్యమైన, పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. బయటి ఆహా ర పదార్థాలకు దూరంగా ఉండాలని, విద్యార్థులు చదువుతో పాటు శారీరక సామర్థ్యం కోసం క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా శిక్షకులు డాక్టర్ వరుణ, తులసీదాస్, చెల్పూర్ పీహెచ్‌సీ వైద్యులు మధుకర్, జాన్సన్, వీరునాయక్, కీర్తన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి



స్టీల్‌ప్లేట్‌లో భోజనం చేస్తున్న ఎంఈవో, టీచర్లు

హుజూరాబాద్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని ఎంఈవో భూపతి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న డిజిటల్ లెర్నింగ్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాల గూర్చి వివరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్లాస్టిక్ ప్లేట్స్, గ్లాసులు వినియోగించకుండా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఉపాధ్యాయులతో కలిసి స్టీల్ ప్లేట్‌లో భోజనం చేవారు. కార్యక్రమంలో తెలంగాణ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొలంపల్లి ఆదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళి



విద్యా సామగ్రి అందిస్తున్న జగదీశ్వర్

హుజూరాబాద్: పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి విద్యార్థులతో కలిసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

రామడుగు: మండలంలోని గుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సాజిదా బుధవారం తనిఖీ చేశారు. వ్యాధి నిరోధక టీకాల నిల్వ, వినియోగ పద్ధతిని పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవుట్ పేషెంట్స్ రిజిస్టర్, లేబర్‌రూం, రోగులకు అందిస్తున్న సేవలు, ఫార్మసీ గది, ల్యాబ్‌ను పరిశీలించి పీహెచ్‌సీ సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. సాధారణ కాన్పులపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి గ్రీష్మన్యా, సిబ్బంది ఉన్నారు.

విచారణ జరిపించాలి

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని 55వ డివిజన్ పరిధిలో ఎంపీ నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని బీఆర్ఎస్ నాయకుడు నందెల్లి అవినాష్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం నగరపాలక సంస్థ అధికారులకు వినతిపత్రం అందజేశారు. 2023, ఆగస్టు 25న కరీంనగర్ ఎంపీ ఫండ్ కింద కేటాయించిన సుమారు రూ.10 లక్షలతో మంకమ్మతోటలో హనుమాన్ ఆలయం, కమ్యూనిటీ హాల్ కోసం శంకుస్థాపన చేశారని తెలిపారు. ఇప్పటివరకు ఆలయ, కమ్యూనిటీ హాల్ పనులు జరగలేదన్నారు.

కళాశాల ఆవరణలో ఇండోర్ స్టేడియం నిర్మించొద్దు

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల మైదానంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం విరమించుకోవాలని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు బుధవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. కళాశాల మైదానం సుమారు 20 ఎకరాలు ఉండగా కొన్నేళ్లుగా ఆక్రమణలకు గురవుతూ ప్రస్తుం ఎనిమిది ఎకరాలకు చేరుకుందని, ఇండోర్ స్టేడియం నిర్మాణంతో విద్యార్థులు, పరిసర ప్రాంత ప్రజలకు వాకింగ్, పిల్లలకు ఆటస్థలం లేకుండా అవుతుందని, ఆక్రమణలు తొలిగించాలని, ప్రస్తుతం మినీ స్టేడియం నిర్మాణం కళాశాలకు అవసరం లేదన్నారు. ఆక్రమణలపై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు గట్టు సాయిరాం, అమ్మ వెంకటేశ్ యాదవ్, ఎండీ సజ్జిద్, మాదారపు రత్నకర్, సుధీర్, రాజేష్, విష్ణు నవీణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలతో కుటుంబం చిన్నాభిన్నం



జమ్మికుంట: ముగ్గులు వేసి అవగాహన కల్పిస్తున్న మెప్మా సంఘ సభ్యులు

చొప్పదండి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిషా ముక్త్ భారత్ కార్యక్రమం బుధవారం కమిషనర్ నాగరాజు ఆధ్వర్యంలో చేపట్టారు. అనంతరం స్వయం సహాయక బృందాల మహిళలతో రంగోళి నిర్వహించారు. ధూమపానం, మద్యపానం సేవించడం వలన వచ్చే ప్రమాదాలను మహిళలు రంగోళి రూపంలో ప్రదర్శించారు. కమిషనర్ మాట్లాడుతూ... ధూమపానం ద్వారా ఊపిరితిత్తులు చెడిపోయి శ్వాస సంబంధ వ్యాధులు, క్యాన్సర్, గుండెపోటు వంట ప్రమాదకరమైన జబ్బులు వస్తాయని, ఆరోగ్యం కోసం పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి శ్రీకీర్తన, ము న్సిపల్ మేనేజర్ డి.ప్రశాంత్‌కుమార్, టీఎంసీ అని త, సాయి, మెప్మా ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.



చొప్పదండిలో..

మత్తుపదార్థాలు అనర్థాలపై అవగాహన

జమ్మికుంట: పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో మత్తుపదార్థాల వినియోగం, అనార్థాలపై బుధవారం ముగ్గులు వేసి ప్రజలు, సంఘం సభ్యులకు అవగాహన కల్పించారు. కమిషనర్ ఎండీ అయాజ్ హాజరై మాట్లాడారు. మాదకద్రవ్యాలతో కుటుంబం చిన్నాభిన్నం అవుతుందని, మహిళలకు మత్తు పదార్థాలు అనర్థాలపై అవగాహన ఉంటే కుటుంబం నష్టపోకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంసీ మల్లీశరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, సీఎల్ఆర్పీలు జ్యోతి, మంజుల, ఆర్పీలు, ఓబీలు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతో రైతులకు మేలు



కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాలతో రైతులకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని దేవంపల్లి, కెల్లెడ, రంగపేట, పచ్చునూర్, లక్ష్మీపూర్, గ్రామాల్లో ఐకేపీ, సింగిల్ విండో ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. రైతులు ఇబ్బందులు పడకుండా నిర్వాహకులు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ప్రభుత్వం మద్దతు ధరతో పాటు సన్నరకం ధాన్యానికి బోనస్ ఇస్తుందన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో నిరుపేదలకు ఊరట

నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్‌తో ఊరట లభిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. బుధవారం మానకొండూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో 112 మందికి రూ.26.86 లక్షలు విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ కోసం ఎదురుచూడాల్సి వచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటవెంటనే చెక్కులు పంపిణీ చేస్తుందన్నారు. వైద్యం కోసం ఖర్చుపెట్టిన మొత్తంలో కొంత మేర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకుంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు, డైరెక్టర్లు, డీసీవో రామానుజచార్యులు, డీఎస్‌వో నర్సింగరావు, సివిల్ సప్లై డీఎం రజనీకాంతారావు, డీటీఎఫ్ శ్రీనివాస్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల్లో మృతిచెందినవారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మానసిక ఆరోగ్యం కాపాడుకోవాలి



మాట్లాడుతున్న మల్లేశం

రామడుగు: మానసిక ఆరోగ్యమే సంపూర్ణ జీవనానికి పునాదులుగా నిలుస్తాయని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎర్రా మల్లేశం సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రామడుగు మోడల్ స్కూల్‌లో అసోసియేషన్ కరీంనగర్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానసిక ఆరోగ్యం బాగుంటే జీవితంలో ఏ రంగంలో నైనా రాణించగలమని, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి విద్యార్థులు ప్రతిరోజు ధ్యానం, ప్రాణాయామం, సమతుల ఆహారం, సరైన నిద్ర, ఆత్మీయ సంభాషణ అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమలో సైకాలజిస్ట్ అలియన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డీజీ నాగేశ్వర్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలి

కరీంనగర్‌కల్చరల్: వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్ అన్నారు. బుధవారం గన్నేరం నర్సయ్య అధ్యక్షతన నిర్వహించిన కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి వ్యవసాయ కార్మిక సంఘాల సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలుగా వ్యవసాయ కార్మికులు వెనుకబడిపోతున్నారని అన్నారు. ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సంవత్సరం గడిచినా కౌలు రైతులను గుర్తించడం లేదని, గ్రామీణ ప్రాంతాల్లో కౌలు రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు అందించాలన్నారు. కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అజయ్, రాజు, సహాయ కార్యదర్శి సంపత్, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్, శ్రీనివాస్, దుర్గాప్రసాద్, పెద్దపెల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గణేశ్, రాజేందర్, నాయకులు సత్యనారాయణచారి పాల్గొన్నారు.

రవాణాశాఖ సేవలకు అంతరాయం



తిమ్మాపూర్: రవాణా సేవలకు బుధవారం అంతరాయం కలిగింది. రెండు, మూడు రోజుల కింద స్లాట్లు బుక్ చేసి వచ్చిచూడగానే సాంకేతిక లోపం వస్తుందని సిబ్బంది చెప్పడంతో సేవాదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయాన్నే క్యూలో నిలబడ్డ వారు గంటల తరబడి వేచి ఉన్నారు. లైసెన్స్, నూతన వాహనాల రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారు ఆవరణలో అవస్థలు పడ్డారు. వేచి ఉండి చివరకు అధికారులు రేపు రమ్మనడంతో విస్మయం వ్యక్తం చేశారు. ఇటీవల కాలం నుంచి తరచూ ఇబ్బంది అవుతున్నా.. కొద్ది సేపట్లో పనిచేయగా బుధవారం మాత్రం మొత్తానికే పని చేయలేదు.

బస్సు కోసం గంటలపాటు ఎదురుచూపు



శంకరపట్నం: కేశవపట్నం బస్టాండ్‌లో బుధవారం మధ్యాహ్నం గద్దపాక బస్సు కోసం ప్రయాణికులు గంటలపాటు ఎదురు చూశారు. ముత్తారం, కన్నాపూర్, ధర్మారం, రాజాపూర్, కాచాపూర్, గద్దపాక గ్రామాలకు చెందిన ప్రయాణికులు వివిధ పనుల కోసం మండల కేంద్రానికి వచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంటకు బస్సు ఉంటుందని బస్టాండ్‌కు చేరుకున్నారు. సుమారు మూడు గంటల వరకు ఎదరు చూశారు. బస్టాండ్‌లో కంట్రోలర్ లేక పోవడంతో ఎవరిని అడగాలో తెలియక అవస్థలు పడ్డారు. 3.15 గంటలకు బస్సు రావడంతో ఇళ్లకు చేరుకున్నారు. కంట్రోలర్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్నారని, విధులు సక్రమంగా నిర్వహించే నియమించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



నందకిశోర్

గంగాధర: ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు గంగాధర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మంచికట్ల నంద కిశోర్ ఎంపికయ్యాడని స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ బాబు శ్రీనివాస్ తెలిపారు. రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని కొదురుపాకలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 17 విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడానికి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడని, ఈనెల 16 నుంచి 18వరకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని హెచ్‌ఎం అనిత కుమారి, ఎంపీడీవో రాము, ఎంఈవో ఏనుగు ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఆలయ భూముల పరిశీలన



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న పూజారులు, ఈవో

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని శ్రీదుబ్బా మల్లికార్జునస్వామి ఆలయానికి చెందిన భూములను ఆక్రమిస్తున్నారనే ఫిర్యాదుతో బుధవారం తహసీల్దార్ నల్ల వెంకట్‌రెడ్డి ఆలయ భూములను పరిశీలించారు. మూడు రోజుల్లో హద్దులు నిర్ణయిస్తామని తెలిపారు. అనంతరం తహసీల్దార్ వెంకట్‌రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి, ఈవో తదితరులు తహసీల్దార్‌ను శాలువాతో సన్మానించారు.

గాలికుంటు నివారణ టీకాలు



టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి మాధవరావు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్, నల్లవెంకయ్యపల్లి గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి మాధవరావు తెలిపారు. రెండు గ్రామాల్లో సుమారు 147 పశువులకు టీకాలు వేశామన్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దు

శంకరపట్నం: రైతులు వరి ధాన్యం రోడ్లపై ఆరబెడుతున్నారని, దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఎస్సై శేఖర్ రెడ్డి అన్నారు. రోడ్డుపై ధాన్యం ఆరబెడితే శిక్షార్హులు అవుతారని, ఖాళీ ప్రదేశాల్లో ధాన్యం ఆరబోసుకోవాలని సూచించారు.

ఇసుక వేలం


జమ్మికుంట: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద 31న ఇసుక వేలం నిర్వహించనున్నామని తహసీల్దార్ నల్ల వెంకట్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఇసుక అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టుకున్నామని, అరవై ట్రాక్టర్లు, పెద్ద టిప్పర్, మూడు మినీ టిప్పర్ల ఇసుక ఉందని, ఆసక్తిగలవారు పరిశీలించుకొని వేలంలో పాల్గొనాలన్నారు. వేలంలో పాల్గొనేవారు దరావత్ చెల్లించాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

హుజూరాబాద్: పట్టణ శివారులోని పరకాల క్రాస్ రోడ్డులో బుధవారం ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి బండారి కొమురయ్య పరకాల క్రాస్ వద్దకు చేరుకోగానే వరంగల్ నుంచి హుజూరాబాద్ వస్తున్న వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టింది. కొమురయ్యకు తీవ్రగాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

మానకొండూర్: మండలంలోని దేవంపల్లి గ్రామానికి చెందిన రేణికుంట బాబు(38) రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. బుధవారం రాత్రి మానకొండూర్ నుంచి దేవంపల్లికి వెళ్తుండగా లలితాపూర్ వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. గాయపడిన బాబును స్థానికులు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు.

సెల్‌ఫోన్లు అప్పగింత



రామడుగు: మండలంలోని మూడు గ్రామాలకు చెందిన వ్యక్తులు సెల్‌ఫోన్లు పోగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్ ఆధారంగా స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించామని ఎస్సై రాజు తెలిపారు. గోపాల్‌రావుపేట, వెదిర, దేశరాజుపల్లి గ్రామాలకు చెందినవారు సెల్‌ఫోన్లు పోయాయని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారని, సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ ద్వారా ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై వివరించారు.